నియోజకవర్గంలో ఎన్నికల అధికారుల నిఘా

మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి రామ్మూర్తి

ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామ్మూర్తి

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 10: ఎన్నికలు ముగిసేవరకు నియోజకవర్గంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులపై ఎన్నికల అధికారుల నిఘా ఉంటుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో వాసం రామ్మూర్తి అన్నారు. మంగళవారం ఎన్నికల అధికారి మాట్లాడుతూ సోమవారం మధ్యాహ్నం నుంచి రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. పార్టీలు, అధికారులు , ప్రజలు ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. ఎన్నికల ముగిసేవరకు సమావేశాలు, ర్యాలీలు ఎన్నికల అధికారుల అనుమతి తీసుకున్నాకే నిర్వహించాలన్నారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు మైకులు, డీజేలు వాడకూడదన్నారు. ప్రభుత్వ ఆస్తులపై వాల్ రైటింగ్, పోస్టర్లు అంటించడం, బ్యానర్లు కట్టడం చేయకూడదని, ప్రైవేటు ఆస్తులపై వాల్ రైటింగ్, పోస్టర్లు అతికించాలంటే యజమానులతో లిఖిత పూర్వకంగా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో 2,42,981 ఓటర్లు ఉన్నారని, 290 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, ఇప్పటి వరకు మూడు చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి

ఓటర్లు తప్పకుండా వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఐదేళ్లకు ఒకసారి వచ్చే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందుకోసం 80 ఏళ్లకు పైబడినవారు, 40 శాతం అంగ వైకల్యం ఉన్నవారు పోలింగ్ బూత్‌కు రాలేని పరిస్థితిలో ఉన్నవారు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటు హక్కుకు అర్హులై ఉండి ఇంకా ఓటు నమోదు చేసుకోని వారు ఈ నెల 30 వరకు ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బయ్యారం, అక్టోబర్ 10: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం జరిగింది. కురవి మండలం గుండ్రాతిమడుగుకు చెందిన ఇస్లావత్ మోతీ, ఇస్లావత్ వీరన్న మహబూబాబాద్ నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా, బయ్యారం శివారులో వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో ఏరియా దవాఖానకు తరలించారు. మోతీ పరిస్థితి విషమంగా ఉన్నది. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నారాయణ సేవలు చిరస్మరణీయం

తొర్రూరు, అక్టోబర్ 10: ఉపాధ్యాయ ఉద్యమ కెరటం నాగటి నారాయణ సేవలు చినస్మరణీయం' అని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ అన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి కే భిక్షపతి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన నారాయణ ప్రథమ వర్ధంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. నారాయణ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అధ్యక్షుడు, జేఏసీ కో చైర్మన్‌గా సుదీర్ఘకాలం పని చేసి ఎన్నో చారిత్రక పోరాటాలకు నేతృత్వం వహించారన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగ చరిత్రలో తనదైన ముద్రవేశారని, ఎందరికో ఆదర్శంగా నిలిచారని తెలిపారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. సంఘం జిల్లా కోశాధికారి నాగ మల్లయ్య, సీనియర్ నాయకులు బంధు నారాయణ, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటేశ్వర్లు, తొర్రూరు, పెద్దవంగర, నర్సింహులపేట, దంతలపల్లి, నెల్లికుదురు బాధ్యులు పాల్గొని నివాళులర్పించారు.

బీఆర్ఎస్ నుంచి కౌన్సిలర్ గజానంద్ సస్పెన్షన్

తొర్రూరు, అక్టోబర్ 10: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న తొర్రూరు మున్సిపాలిటీ 8వ వార్డు కౌన్సిలర్ నర్కూటి గజానంద్‌ను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేసినట్లు పార్టీ పట్టణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రామిని శ్రీనివాస్, కుర్ర శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకు క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్‌తో కలిసి పార్టీ కౌన్సిలర్లు, ముఖ్య యువకులతో నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. కొన్ని రోజులుగా బీఆర్ఎస్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుండడంతో ఎన్నో సార్లు చెప్పినా అతడి వైఖరిలో మార్పు రాకపోవడంతో మంత్రి దయాకర్ రావు ఆదేశాల మేరకు గజానంద్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జినుగ సురేందర్‌రెడ్డి, ఫ్లోర్‌లీడర్ ఎన్నమనేని శ్రీనివాస్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల వివరాలను నమోదు చేయాలి

పెద్దవంగర, అక్టోబర్ 10: మండల విద్యావనరుల కేంద్రంలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలకు యూడైస్, ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నైషన్ యాప్)పై స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు బీ శ్రీనివాస్, ఏ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలల్లోని విద్యార్థుల వివరాలను తప్పనిసరి సంబంధింత యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. సీఆర్‌పీలు సంతోష్‌కుమార్, నిరంజన్, రంగన్న, రమాదేవి, హెచ్ఎంలు పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలు చేరువయ్యాయి..

జనగామ చౌరస్తా, అక్టోబర్ 10 : జిల్లా ఏర్పాటుతో ప్రజలకు ప్రభుత్వ పాలన సేవలు మరింత చేరువయ్యాయి. గతంలో ఏదైనా పని మీద జిల్లా అధికారులను ఇక్కడి ప్రజలు కలవాల్సి వస్తే వరంగల్‌కు రాను పోను వంద కిలో మీటర్లు ప్రయాణించాల్సి వచ్చేది. తీరా అక్కడికి వెళ్లాక సమయానికి అధికారులు దొరికేవారు కాదు. సామాన్యులు బస్ చార్జీల విషయంలో ఇబ్బంది పడేది. కొత్త జిల్లా ఏర్పాటుతో ఆ సమస్య తీరింది. ప్రజలకు చేరువలో ప్రభుత్వ కార్యాలయాలన్నీ కూడా ఒకే చోట ఉన్నాయి. జిల్లా అధికారులు సైతం ఏ సమయానికి వెళ్లిన ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. ముఖ్యంగా జిల్లాలో విద్య, వైద్యం, ఉపాధి రంగాలు చాలా మెరుగయ్యాయి. జిల్లా ఆసుపత్రి, మెడికల్ కళాశాల ఏర్పాటుతో ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా నాణ్యమైన వైద్య పరీక్షలు, డయాలసిస్ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

పానుగంటి రామ్మూర్తి,
ప్రభుత్వ ఉపాధ్యాయుడు, జనగామ

అభివృద్ధి ఫలాలు అందరికీ అందుతున్నాయి..

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 10 : చిన్న జిల్లాల ఏర్పాటుతో ప్రభుత్వం అందించే సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అర్హులందరికీ అందుతున్నాయి. జిల్లాల ఏర్పాటుతో ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు త్వరితగతిన పూర్తి కావడంతో ప్రజల వ్యయ ప్రయాసలు తగ్గాయి. అంతే కాకుండా అధికారులకు పని ఒత్తిడి తగ్గింది. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరిగాయి. చిన్న జిల్లాలు ఏర్పాటు కాకుంటే తెలంగాణలో ఇన్ని మెడికల్ కళాశాలలు వచ్చేవి కావు. పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమయ్యేవారు. స్టేషన్ ఘన్‌పూర్‌కు వంద పడకల ఆసుపత్రి కూడా వచ్చేది కాదు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతోనే సీఎం కేసీఆర్ ముందు చూపుతో చిన్న జిల్లాలను ఏర్పాటు చేశారు. దీంతో జిల్లాలకు నిధులు, నియామకాలు పెరిగి జిల్లాలతో పాటు రాష్ట్రం అభివృద్ధి చెందుతున్నది.

ఎండీ దస్తగిర్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం
అధ్యక్షుడు, స్టేషన్ ఘన్‌పూర్

అల్లరి

ALLARI

చెప్పుకోండి

1. విఖ్యాత పెయింటింగ్ 'మోనాలిసా' రూపకర్త ఎవరు?
2. నవ బ్రహ్మ దేవాలయాలు ఎక్కడ ఉన్నాయి?
3. ఆఫ్ఘనిస్తాన్ జాతీయ జంతువు ఏది?

పెద్దల మాట



రేపే చనిపోతున్నట్టు జీవించు! శాశ్వతంగా బతికి ఉంటానని భావించి జ్ఞానాన్ని సంపాదించు.

• **మహాత్మా గాంధీ**

కథ

ఐకమత్యం!

ఒక అడవిలో పలవల దుప్పి (పెద్ద కొమ్ములుండే దుప్పి) తన బుజ్జి కూనతో ఉండేది. కాలక్రమేణా కూనదుప్పి పెరిగి పెద్దదయ్యింది. దానికీ కొమ్ములు వచ్చాయి. 'నాకూ కొమ్ములున్నాయి కదా!' అని గర్వపడేది ఆ పిల్ల దుప్పి. ఒకరోజు తల్లి దుప్పి తన బిడ్డను పిలిచి.. ''ఈ అడవిలోని దుప్పులన్నిటికీ కొమ్ములు ఉన్నాయి. నీకు మాత్రం.. కొమ్ములతోపాటు గర్వం కూడా పెరిగింది. అందుకే, అందరితోనూ పోట్లాటకు దిగుతున్నావు. అలా మనలో మనం పోట్లాడుకుంటే.. వేరే జంతువులు మన బలహీనతను పట్టేసుకుంటాయి. మనకు ఇబ్బంది కలిగిస్తాయి. అదే.. మంచిగా, ఐకమత్యంతో ఉంటే అడవిలోని జంతువులన్నీ నీకు స్నేహితులు అవుతాయి!'' అంటూ మంచితనం, ఐకమత్యం గురించి వివరించింది.

అంతా విన్న పిల్ల దుప్పి.. ''సరేనమ్మా! నువ్వు చెప్పిన విషయం అర్థం చేసుకున్నాను'' అని తల్లితో చెప్పింది. ఒక రోజు మేత కోసం బయటికి వెళ్లింది పిల్ల దుప్పి. ఎదురుగా మరో పొగరుబోతు పిల్ల దుప్పి.. గొడవకు దిగింది. పిల్ల దుప్పికి తన తల్లి చెప్పిన మాటలు గుర్తుకు వచ్చి.. ''మిత్రమా! మనలో మనకు పోట్లాట ఎందుకు? హాయిగా ఆకులు తిందాం! చక్కగా ఆడుకుందాం!'' అని చెప్పింది. కానీ, ఆ పొగరు బోతు దుప్పి ఆ మాటలు వినలేదు. వేగంగా వచ్చి.. తన కొమ్ములతో పిల్ల దుప్పిని కుమ్మబోయింది. తనను తాను కాపాడుకునేందుకు పిల్ల దుప్పి కూడా తన కొమ్ములతో అడ్డుకుంది! ఆ పోట్లాటలో ఒకదాని కొమ్ముల్లో మరొకదాని కొమ్ములు ఇరుక్కుపోయాయి! అవి విడిపించుకునేందుకు అనేక విధాల ప్రయత్నించసాగాయి. వాటిని గమనించిన అడవి కుక్కలు.. తమకు ఆహారంగా రెండు దుప్పులు దొరికాయని సంబురపడ్డాయి. వేగంగా వాటివైపు రాసాగాయి. ఇదంతా చెట్టుమీద ఉన్న చింపాంజీ గమనిస్తూనే ఉంది. పెద్దగా అరుస్తూ వచ్చి.. వేటకుక్కలను తరిమేసింది. దుప్పుల దగ్గరికి వచ్చి.. వాటి కొమ్ములను వేరు చేసింది. ''పిల్ల దుప్పులూ! మీకు కొమ్ములు ఉన్నది.. శత్రువులనుంచి రక్షించుకోవడానికే. మీలో మీరు పోట్లాడుకోవడానికి కాదు. ఐకమత్యంగా ఉండకుండా.. ఇతర జంతువులకు ఆహారంగా మారుతున్నారు. ఇప్పటికైనా.. అందరూ కలిసిమెలిసి ఉండండి!'' అని హితబోధ చేసింది. చింపాంజీ మాటలను అర్థం చేసుకున్న రెండు పిల్ల దుప్పులూ.. కలిసి తమ తల్లుల దగ్గరికి వెళ్లాయి.

• **కంచనపల్లి వెంకట కృష్ణారావు**

పదసృష్టి

కింది పదంలోని అక్షరాల సాయంతో ఎన్ని కొత్త పదాలను సృష్టించగలరో చూడండి.

Bread

Ex : Read

పిటిర్ క్యాండ్స్



శ్రీనివాస్,
రాయిలాపూర్.

పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు, జోక్స్ మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం.
మా చిరునామా: zindagi@ntnews.com

జవాబులు
1. ఇక్కడ ఎన్ని, 2. ఇంద్రకీలాద్రి, 3. ఒంటె

చేయండి

ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు చిత్రాల్లో 10 తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టండి.